

నూతన డీఈవోగా బ్రహ్మాజీరావు



పార్వతీపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా బ్రహ్మాజీరావు నియామకమయ్యారు. ప్రస్తుతం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లాలో డిస్ట్రిక్ట్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై ఇక్కడకు వస్తున్న ఆయన గతంలో మన్యం జిల్లాలో డీఈవోగా పనిచేశారు. ఇన్‌చార్జి డీఈవో రాజ్‌కుమార్ నుంచి త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తామని, టెన్త్ ఫలితాల్లో జిల్లాను మరోసారి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం నిలిచేలా చర్యలు తీసుకుంటామని నూతన డీఈవో తెలిపారు.

- జిల్లాలోని రైల్వే స్టేషన్లలో వసతులు కరువు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- వినతులు ఇస్తున్నా.. ఫలితం శూన్యం



బెలగాం రైల్వేస్టేషన్



బెలగాం స్టేషన్‌లో ఇరుకైన మెట్ల మార్గంలో ప్రయాణికులు ఇలా..

సమస్యల కూత వినిపించదా..?



కొమరాడలో ఒక రైల్వేగేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

పార్వతీపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైల్వే స్టేషన్లలో సమస్యలు తిష్ట వేశాయి. మౌలిక వసతులు కొరవడ్డాయి. ప్రధాన రైళ్లకు కూడా హాల్ట్ ఉండకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ విజయనగరం, విశాఖకు చేరుకోవాల్సి వస్తోంది. మరోవైపు రైల్వే గేట్ల సమస్య కూడా ప్రయాణికులు, వాహనదారులను వేధిస్తోంది. రెండు కిలో మీటర్ల లోపు మూడు రైల్వేగేట్లు ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒకసారి గేటు పడితే సుమారు 20 నుంచి 25 నిమిషాల పాటు గేటుకు ఇరువైపులా వాహనదారులు నిరీక్షిం చాల్సి వస్తోంది. ఇదే సమయంలో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు దీరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకపోతే సాలూరుకు రైలు ఎప్పుడోస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్పితే.. రైలు వచ్చే మార్గం చూడ డం లేదు. దీంతో ఆయా ప్రాంతవాసులు పెదవి విరుస్తున్నారు. మొత్తంగా జిల్లాలో రైల్వే శాఖ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మోక్షం లభించడం లేదు.

రైల్వేగేటు పడితే.. అంతే..

- కొమరాడ మండలంలో సుమారు మూడు కిలోమీటర్ల లోపు మూడు రైల్వేగేట్లు ఉన్నాయి. ప్రతి పది నుంచి 15 నిమిషాలకు గేట్లు పడుతుం డడంతో వాహనదారులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. వాస్తవంగా ఇది అంతర్రాష్ట్ర రహదారి. నిత్యం వేలాదిగా ఒడిశా- ఆంధ్రా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రైల్వే గేట్లతో వాహనదారులంతా తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు.
- జిల్లా కేంద్రం బెలగాం వద్ద ఉన్న రైల్వే గేటు వల్ల సుమారు 15 గ్రామాలతో పాటు పట్టణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అత్యవసర వేళల్లో చాలామంది వైద్య సేవలు కూడా పొందలేక పోతున్నారు. మూడో రైల్వే మార్గం వేసిన తర్వాత తరచూ స్టేషన్ సమీపంలోనే గేట్ పడుతుండడంతో చోదకులకు నిరీక్షణ తప్పడం లేదు.

సాలూరుకు రైలు వచ్చేదెప్పుడు?

గతంలో సాలూరులో రైల్వేస్టేషన్ మీదుగా సాలూరు-బొబ్బిలి మధ్య రైలు బస్ నడిచేది. కరోనా కాలంలో ఆ సర్వీసును నిలిపేశారు. ఇప్పటికీ దానిని పునరుద్ధరించకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, గ్రామీణులకు

(మిగతా 8వ పేజీలో...)



పిచ్చిమొక్కలతో నిండిన సాలూరు రైల్వే స్టేషన్

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పార్వతీపురం, బెలగాం, గుమడ, సీతానగరంలో రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఇక నర్సిపురంలో పాసింజర్ రైళ్లకు మాత్రమే హాల్ట్ సదుపాయం కల్పించారు. కాగా పార్వతీపురం పట్టణంలో రెండు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. బెలగాం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌తో పాటు పాసింజర్ రైళ్లకు హాల్ట్‌లు ఉన్నాయి. కొత్తవలస పరిధిలో ఉన్న టౌన్ రైల్వేస్టేషన్‌లో కొన్ని ఎక్స్ ప్రెస్ , పాసింజర్ రైళ్లు మాత్రం నిలు స్తాయి. కిలో మీటరు దూరంలో ఈ రెండు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా బెలగాం స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. 22 ప్రయా ణికులు, 60 వరకు గూడ్స్ రైళ్లు నడుస్తున్నాయి. అయితే ఆయా స్టేషన్లలో ప్రయాణికుల విశ్రాంతి కోసం చిన్న గదిని మాత్రమే కేటాయించారు. ఏసీ ప్రయాణికులకు ప్రత్యేక విశ్రాంతి రూమ్ లేదు. ఇక బెలగాం రైల్వే స్టేషన్‌లో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వల్ల ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్లు వద్ద ఇరుకుగా ఉండడంతో సీనియర్ సిటిజన్లు, చిన్నారులతో మెట్లు ఎక్కి దిగడం కష్టత రంగా మారింది. ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని గతంలో రైల్వేశాఖ ఉన్నతాధికారులు చెప్పినా.. ఆ దిశగా ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

రెవెన్యూ సేవలపై

అర్జీదారులు సంతృప్తి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవలపై అర్జీదారులు శతశాతం సంతృప్తి చెందినట్లు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ' ఈ ఏడాది సెప్టెంబరు 29న తొలిసారిగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటుచేసి.. జిల్లాలో రెవెన్యూ సమస్యలకు చెక్ పెట్టాం. తొమ్మిది వారాల్లో వచ్చిన అర్జీలన్నింటినీ పరిష్కరించడానికి తహసీల్దార్లు ఎంత గానో కృషి చేశారు. ప్రస్తుతం అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫోన్‌కాల్ ద్వారా ఈ విషయం తెలుసుకున్నాం. ఇది రెవెన్యూ క్లినిక్ సాధించిన అతిపెద్ద విజయం. జిల్లాలో ఎవరికైనా రెవెన్యూ సమస్యలుంటే వెంటనే రెవెన్యూ క్లినిక్‌లో అర్జీలు అందించాలి. కాగా తొలి ఆరు వారాల్లో అందిన 227 ఫిర్యాదులను పరిష్కరించడమే కాకుండా అర్జీదారులకు ఫోన్ చేశాం. వారిలో 173 మంది కాల్ లిఫ్ట్ చేశారు. రెవెన్యూ సేవలపై సంతృప్తిగా ఉన్నామని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 16 రకాల రెవెన్యూ సమస్యలను గుర్తించి.. పరిష్కార మార్గం చూపాం.' అని తెలిపారు.

అనంతరం జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 'గతంలో గ్రీవెన్స్‌లో అర్జీ తీసుకొని సబ్ కలెక్టర్ లేదా తహసీల్దార్‌కు ఎండార్స్ చేసే వాళ్లం. ఆ తర్వాత అది పరిష్కారం అయిందా లేదా అని సమా చారం ఉండేది కాదు. రెవెన్యూ క్లినిక్‌తో వాటికి చెక్‌పెట్టి అక్కడి కక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.' అని చెప్పారు.



విలేఖర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

లివిరి గోపీనాథ ఆలయంలో చోరీ

- అరతులం బంగారం, 56 తులాల వెండి ఆభరణాలు అపహరణ
- రూ.15వేల నగదు కూడా..
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

భామిని, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో పేరొందిన పుణ్యక్షేత్రం.. లివిరి గ్రామంలోని గోపీనాథ రాధారాణి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున అర్చకుడు గోపీనాథ్ చౌదరి ఆలయానికి వెళ్లారు. అప్పటికే తలుపులు తెరిచి ఉన్నాయి. తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమ నించి వెంటనే ఆలయ సేవ కమిటీ సభ్యులు, మిగతా అర్చకులు సమాచారం అందించారు. వారితో పాటు గ్రామస్థులందరూ అక్కడకు చేరుకొని బత్తిలి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జి.అప్పారావు, తన సిబ్బంది హుటాహుటిన ఆలయానికి చేరుకున్నారు. అర్చకుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆలయంలో పరిస్థితి, సీసీ కెమెరాలు వంటి అంశాలపై ఆరా తీశారు. కాగా సీసీ కెమెరాలకు సంబంధించిన వీవీఆర్‌ను ఎత్తుకుపోవడంతో పాటు వైర్లు కత్తిరించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం పాలకొండ డీఎస్పీ రాంబాబు, క్లూస్‌టీం సైతం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మూలవిరాట్‌కు చెందిన అర తులం బంగారు ఆభరణాలు, 56 తులాల వెండి ఆభరణాలు, రూ.15వేల నగదును దొంగలు అపహరించినట్లు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పోలీసులకు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఇదిలా ఉండగా చోరీ ఘటనతో భక్తులు మనస్తాపానికి గురయ్యారు. వేకువజామున పూజలకు చేరుకున్న పొందల కాలనీకి చెందిన సుకుమారి అనే వృద్ధురాలతో మరికొందరు ఈ విషయం తెలుసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.



గర్భగుడిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ



రైస్‌మిల్లు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నాలుగు కేజీలు

అదనంగా ఇవ్వాలట?

- ధాన్యం కొనుగోలులో మిల్లర్ తీరుపై రైతుల ఆందోళన

పాలకొండ, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్ తీరుపై రైతులు ఆందోళన చెందారు. పాలకొండలో రోడ్డెక్కారు. వివరాల్లోకి వెళ్తే.. భాసూరు గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్‌తో ధాన్యాన్ని సోమవారం సాయంత్రం పాలకొండలో ఎన్ ఎస్ఎన్ రైస్‌మిల్లుకు తరలించాడు. అయితే 80 కేజీల బస్తాకు అదనంగా నాలుగు కేజీలు ఇవ్వాలని రైస్‌మిల్లరు పట్టుబట్టారు. దీంతో ఆ రైతు ధాన్యాన్ని అక్కడే విడిచిపెట్టి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మంగళవారం గ్రామ రైతులతో కలిసి రైస్ మిల్లు వద్దకు చేరుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలోనే మిల్లు యజమాని , రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అక్కడుకు చేరుకుని వారిని సముదాయించారు. సీఎస్‌డీటీ సన్యాసిరావు తదితరులు మిల్లు వద్దకు వచ్చి ధాన్యం అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో రైతులు అక్కడ నుంచి వెనుదిరిగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం చొరవ తీసుకొని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి హామీ ఇచ్చారు.

అసంపూర్తిగా సచివాలయాల నిర్మాణాలు — 8లో

వ్యాపారులకు పత్తి విక్రయాలు

మటన్ విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి — 8లో
- జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వినోద్‌కుమార్

16 లోగా విచారణకు హాజరుకావాలి



విచారణాధికారి రమణమూర్తి

గరుగుబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి పీఏసీఎస్ పరిధిలో రుణాలు తీసుకున్న సభ్యులు తగు సమాచారంతో విచారణకు హాజరుకావాలని విచారణాధికారి ఆర్. రమణమూర్తి కోరారు. మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ' ఇక్కడ విధులు నిర్వహించి మృతి చెందిన సీఈవో సంఘం పరిధిలో పలు అవకతవకలు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ఆగస్టు 20 నుంచి రుణాలు పొందిన వారి నుంచి సమాచారం సేకరిస్తున్నాం. సంఘంలో సుమారు 1500 మంది

(మిగతా 8వ పేజీలో...)

రైతులను ఇబ్బంది పెట్టొద్దు: డీఏవో

సీతానగరం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి అన్నపూర్ణ సూచించారు. అంటిపేట, రామవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు సిబ్బంది ఎటువంటి అపోహలకు అవకాశం ఇవ్వకుండా విధులను నిర్వహించాలన్నారు. అ తర్వాత రైతులతో మాట్లాడారు. ప్రభుత్వమే ఉచితంగా గోనె సంచులు సరఫరా చేస్తుందని తెలిపారు. ఒకవేళ రైతు గోనె సంచులు కొనుగోలు చేస్తే రూ. 4.74 జమ చేస్తామన్నారు. హమాలీ చార్జీలనూ ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడించారు. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకొని కస్టోడియన్ ఆఫీసర్ లాగిన్‌లో క్లియర్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యం
- మంత్రి సంధ్యారాణి

6లో

జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి: ప్రభుత్వ విప్ జగదీశ్వరి

క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

6లో

ఆ ఆహారం అపాయం



- బయట తిళ్లు, కలుషిత తాగునీటితో కొత్త రోగం
- జీర్ణ వ్యవస్థపై హెచ్ పైలోరి దాడి
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- కలవరపెడుతున్న గ్యాస్ట్రిక్ సమస్యలు
- క్యాన్సర్ వచ్చే ముప్పు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అశ్రద్ధ వల్ల చాలా మంది గ్యాస్ట్రిక్ సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. సాధారణంగా కన్పించే గ్యాస్ట్రిక్ సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల చివరకు అత్యంత ప్రమాదకరమైన హెలికోబాక్టర్ పైలోరీ (హెచ్ పైలోరీ) ఇన్‌ఫెక్షన్‌కు దారితీసి.. దీర్ఘకాలిక వ్యాధులకు కారణమౌతోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఆసుపత్రులకు జీర్ణకోశ సమస్యలతో వచ్చే రోగుల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. ఈ కేసుల్లో అధిక శాతం హెచ్‌పైలోరీ, తీవ్రమైన గ్యాస్ట్రైటిస్‌తో బాధపడుతున్నవారే కావడం ఆందోళన కలిగించే అంశం. ఉమ్మడి జిల్లాలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ లేకపోవడంతో అత్యధికులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరికొందరు విశాఖకు పరుగులు పెడుతున్నారు.

హెచ్ పైలోరీ సమస్యకు కారణాలు

కడుపులో ఆమ్లం ఎక్కువ ఉత్పత్తి కావడం వల్ల లేదా కడుపు లోపలి పొర దెబ్బతినడం వల్ల వచ్చే సమస్యలనే సాధారణంగా గ్యాస్ట్రిక్ సమస్యలుగా వ్యవహరిస్తారు. ఇవి కేవలం కడుపుబ్బరం, తేనుపులకే పరిమితం కాకుండా కడుపుపొరకు వాపు కలిగించి తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. ముఖ్యంగా గుండెల్లో మంట, ఛాతీభాగంలో లేదా గొంతు వద్ద మంటగా అన్పించడం, కడుపుబ్బరం, కడుపు నిండుగా వుండడం, గట్టిగా వున్నట్టు అన్పించడం, కడుపులో విపరీతమైన మంట వంటి సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలు కన్పించినప్పుడు చాలా మంది సొంత వైద్యం చేసుకుంటున్నారు. ఈ తరహా గ్యాస్ట్రిక్ సమస్యలు అధిక శాతం హెచ్ పైలోరీ అనే బ్యాక్టీరియా వల్ల వస్తున్నాయని, ఇది కలుషిత నీరు, ఆహారం ద్వారా శరీరంలో చేరి ఆమ్లం స్రవించడాన్ని దెబ్బతీస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒక్కోసారి అది క్యాన్సర్‌కు దారితీయవచ్చునని హెచ్చరిస్తున్నారు.



- ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది హెచ్ పైలోరీ బ్యాక్టీరియాతో

(మిగతా 8వ పేజీలో...)

సరికొత్తగా..!

- గజపతినగరం రైల్వే స్టేషన్ సిద్ధం
- ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా వసతులు
- ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని ఈ ప్రాంతీయుల విన్నపాలు



ప్లాట్ ఫారం పనులు చేస్తున్న దృశ్యం

గజపతినగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలో కొత్త రైల్వే స్టేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడో రైల్వే లైను పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాబోయే రోజుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉన్న కొత్తగా రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. రైళ్ల రద్దీకి అనుగుణంగా నాలుగు ప్లాట్‌ఫారాలను సిద్ధం చేస్తున్నారు. ప్లాట్‌ఫారాలపై ఫ్యాన్లు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. జాతీయ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు చేరుకునేలా స్థలాన్ని సేకరించి... నాలుగు లైన్లుగా రహదారిని విస్తరించారు. ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడంతో పాటు వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు అనుకూలంగా ఉండే విధంగా ఇప్పటికే పార్కును ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం రైల్వే స్టేషన్ నుంచి స్థానికులతో పాటు దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లోని సుమారు 141 గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. నిత్యం రూ.వేలల్లో ఆదాయం వచ్చే రైల్వే స్టేషన్‌ను ఇన్నాళ్లకు ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే దిశగా పనులు చేపట్టడంపై ఈ ప్రాంతీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గజపతినగరం రైల్వేస్టేషన్

ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి

గజపతినగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ అధికంగానే ఉంటుంది. తిరుపతి, ఢిల్లీ, చెన్నై వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు విజయనగరం లేదా విశాఖపట్నం వెళ్లి... అక్కడ రైలును ఆశ్రయించాల్సి వస్తోంది. గజపతినగరం స్టేషన్ మీదుగా 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖపట్నం- రాయ్‌పూర్ (కోర్బా) దన్‌బాద్-అలెప్పీ (బొకారో), సంబల్‌పూర్-నాందేడ్ (నాగావళి), హథియా-యశ్వంతపూర్, జునాగడ్-భువనేశ్వర్, హీరాకుడ్-భువనేశ్వర్, సంబల్‌పూర్ -ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో ఒక్క నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ఈ స్టేషన్‌లో నిలుస్తుంది. నిత్యం సుమారు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తుంది. అయినా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ నిలపకపోవడం పై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న స్టేషన్‌లోనైనా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.



కాలినడక వంతెన

క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ

- 'మన్యం' కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల స్థాయిలో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్యం జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదన్నారు. మొత్తం 13 క్రీడాంశాలలో క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ప్రతిభ, అర్హత కలిగిన క్రీడాకారులను గుర్తించి ఏదైనా స్పోర్ట్స్‌స్కూల్‌లో తర్ఫీదు ఇస్తామని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 12, 13 తేదీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో మంచి నీటి పథకాలను ఆమె ప్రారంభించారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఒక పైలెట్ వాటర్ స్కీం, 1వ వార్డు కోటవీధిలో ఒకటి, 4వ వార్డు హరిజన పేట, రెల్లివీధిలో 2 పైలెట్ వాటర్ స్కీమ్‌లను ప్రారంభించారు. పదో వార్డు బోను మహంతివీధి, డెంకాడ వీధిలో 2 పథకాలు, 23వ వార్డు రామాకాలనీలో 2 పైలెట్ వాటర్ సీమ్‌లను ప్రారంభించారు. మొత్తం రూ.14.40 లక్షల వ్యయంతో నిర్మించిన 8 పథకాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ వేసవిలో పట్టణ వాసులకు తాగునీటి ఎద్దడి ఎదురవకుండా ఉండేందుకు ఈ పథకా లను ప్రారంభించినట్టు తెలిపారు. పట్టణ అభివృద్ధి టీడీపీ హయాంలోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), తదితరులు పాల్గొన్నారు



బిందెతో నీటిని తెస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డీ అరుణ్ బాబు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.... జిల్లాలో వీటి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాకు సంబంధించి 13,309 ఇళ్లు పూర్తి చేయాలనేది లక్ష్యమని తెలిపారు. దీనిపై మండలాల వారీగా ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం వచ్చే ఉగాది నాటికి వీటిని పూర్తి చేయాలన్నారు. ఆవాస్ యోజన 2.0 పథకం సర్వే ప్రక్రియ ఈనెల 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విజయనగరం మండలంలోని గుంకలాం, గొల్లలపేట గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. అధికారులకు, లబ్ధిదారులకు వీటిపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అరుణ్‌బాబు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు సృష్టించొద్దు

- జేసీ సేతుమాధవన్



రామస్వామిపేట రైసు మిల్లును పరిశీలిస్తున్న జేసీ తదితరులు

వేపాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు సృష్టించొద్దని విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులకు స్పష్టం చేశారు. మండలంలోని రామస్వామిపేట గ్రామంలో గల శ్రీలక్ష్మీ శ్రీనివాస మిల్లును మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ ధాన్యం కొనుగోలు తీరుపై ఆరా తీశారు. ముందుగా బల్లంకి, బానాది గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. బల్లంకిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం సక్రమంగా పని చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. ఈమేరకు జేసీ ఈ కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది లేకపోవడంతో సచివాలయ వీఏఏతోను, గ్రామస్థులతోను మాట్లాడి...కేంద్రం పని తీరుపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ జె.రాములమ్మను ఆదేశించారు. వ్యవసాయాధికారి స్వాతి, తదితరులు ఉన్నారు.

భూ సేకరణపై ఫిర్యాదులు ఇవ్వండి

వేపాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి సంబంధించి.. భూ సేకరణపై నిర్వాసిత రైతులకు అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు ఇవ్వాలని భూ సేకరణ ప్రత్యేక కలెక్టర్ ఎంఎస్ కళావతి కోరారు. సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. రామస్వామిపేట గ్రామంలో నిర్వాసిత రైతులతో మంగళవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములకు అధిక ధర చెల్లించాలని కోరుతూ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా రాత పూర్వకంగా ఫిర్యాదులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రెండు కిలోమీటర్లు..

- కీలక రహదారికి మరమ్మతులు అవసరం
- రాజాంలో ట్రాఫిక్ సమస్యలకు మోక్షం కలిగితే వందలాది మందికి ప్రయోజనం
- ఆ దిశగా పట్టించుకోని యంత్రాంగం



అధ్వానంగా తయారైన రోడ్డు

రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట-బుచ్చెంపేట గ్రామాల మధ్య రహదారిని గమనిస్తే.. అధికారులు ప్రతిపాదనలు తయారు చేయక.. నాయకులు అటువైపు కన్నెత్తి చూడక దారుణంగా తయారైంది. దశాబ్ద కాలంగా కేవలం రెండు కిలోమీటర్ల రహదారి మరమ్మతులు చేపట్టడంలో అధికారులు, నాయకుల నిర్లక్ష్యం కారణంగా వందలాది మంది ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. రూ.లక్షల్లో వెచ్చించి రహదారి మరమ్మతులు చేపడితే వందలాది ద్విచక్ర వాహనాలు, కార్లు, మినీ వ్యాన్లు, ఆటోలు రాజాం పట్టణంలోనికి రాకుండా ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అవకాశాలు ఉన్నాయి. దీంతో పట్టణం వైపు రద్దీ తగ్గుతుంది. ట్రాఫిక్ సమస్యలకు తెర పడుతుంది. 2009 నుంచి 2019 వరకూ పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన కంబాల జోగులుకు స్థానికులంతా అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీంతో రహదారి మరింత దారుణంగా తయారైంది.

ఆ రెండు కిలోమీటర్లు ఎక్కడంటే.. బొబ్బిలి రోడ్డులోని కొండంపేట జంక్షన్ నుంచి వీర్రాజు చెరువు గట్టు మీదుగా బుచ్చెంపేట వరకూ సుమారు రెండు కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు గురైంది. రాళ్లు తేలి... నడక కూడా నరకంగానే ఉంది. గతంలో వీర్రాజు చెరువు గట్టును విస్తరించి రింగ్ రోడ్డుగా మార్చారు. దీంతో వందలాది వాహనాల రాకపోకలకు అనువుగా మారింది. రాజాం పట్టణంలోకి రాకుండా వందలాది మంది ఈ మార్గంలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు. దశాబ్దకాలంగా ఈ రహదారిపై అధికారులు శీతకన్నేశారు. రాళ్లు తేలిపోయాయి. గుంతలు ఏర్పడ్డాయి. పాదచారులు సైతం అవస్థలు పడుతున్నారు.



కొండంపేట- బుచ్చెంపేట రోడ్డులో ఇలా...

మరమ్మతులు చేయిస్తే...

ఈ రెండు కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేపడితే వందలాది మందికి ప్రయోజనం చేకూరుతుంది. మండల ప్రజలతో పాటు సమీపంలోని తెర్లాం, మెరకముడిదాం మండలాలకు చెందిన వందలాది మంది నిత్యం కొండంపేట మీదుగా జి.ఎం.ఆర్. నగర్‌లోని కేర్ హాస్పిటల్, ఎల్.కె.జి. నుంచి పీజీ, ఇంజినీరింగ్, బి.ఇడి. తదితర విద్యా సంస్థలకు ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్నారు. రేగిడి, వంగర, సంతకవిటి, పాలకొండ తదితర మండలాలలో ఉద్యోగాలు చేస్తున్న వారంతా ఈ మార్గాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా రాకపోకలు సాగిస్తే రాజాం పట్టణంలోనికి రాకుండా... ట్రాఫిక్ అవస్థలకు గురికాకుండా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. పైగా ఆరు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. ఇంత ప్రాధాన్యం ఉన్న రహదారిని అధికారులు పట్టించుకోకపోవడంపై ఈ ప్రాంతీయులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి.. ఈ రహదారిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని అంశాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శాఖ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారులు ఏడు ప్రగతి సూచికలపై ప్రత్యేక దృష్టి పెట్టి.. 100 శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించాలని... వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. తరచూ అనారోగ్యం పాలవుతున్న పిల్లలను గుర్తించి పెరుగుదల తగ్గిపోకుండా చూడాలని ఆదేశించారు. తక్కువ ప్రగతి మండలాలను గుర్తించి.. ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ విమల రాణి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 201 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అంగన్‌వాడీల్లో 7,104 మంది గర్భిణులు, 7,177 బాలింతలు ఉన్నారని చెప్పారు. వారికి పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో మాణిక్యం నాయుడు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న వన్‌స్టాప్ వెహికల్ హెల్ప్‌లైన్ వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ రామసుందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

వైద్య సదుపాయాలు మెరుగుపరచండి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రి, ఘోషాసుపత్రిలో వైద్య సదుపాయాలను మెరుగుపర్చేందుకు, అదనపు వసతులు కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులతో అత్యవసర వైద్య పరికరాలను వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. టీబీ ఆసుపత్రి ఆవరణను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజుతో కలసి జీజీహెచ్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. జీజీహెచ్‌లోని అత్యవస రేతర విభాగాలను గాజులరేగ సమీపంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోకి తరలించే అంశంపై త్వరలో కలెక్టర్ ఆ ధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఆసుపత్రిలో కొత్తగా ఒక లైఫ్ సపోర్టు అంబులెన్స్ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ యూనిట్, దానికి అనుబంధంగా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఘోషాసుపత్రి లోపల భవనాల నిర్మాణం, 15 సీసీ కెమెరాలు ఏర్పాటు, రూ.20 లక్షల విలువైన డయథెర్మీ పరికరం ఏర్పాటు, వివిధ ధ్రువ పత్రాలకు చార్జీల పెంపు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకంపై చర్చించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు అల్లు పద్మజ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ దేవి మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అదితి



మాట్లాడుతున్న విప్ జగదీశ్వరి

జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గరుగుబిల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్పు చేసేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్రకు మంగళవారం ఖడ్గవలస సముదాయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మత్తు నుంచి బయటపడేలా జిల్లా పోలీసు శాఖ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మత్తులో యువత భవిష్యత్తు చిత్తవుతుందన్నారు. నేరాలు పెరగడానికి ప్రధాన కారణం మత్తు పదార్థాలేనన్నారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు... ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పాయకరావుపేట నుంచి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న బృందం ప్రతినిధి మనోజ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ రాంబాబు, కార్పొరేషన్ డైరెక్టర్లు అంబటి రాంబాబు, అక్కేన మధుసూదనరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ఎం.నారాయణస్వామి, డొంకాడ రామకృష్ణ, ముదిలిబాబు విజయవాంకుశం, కోట భరత్‌కుమార్, చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్‌ఐ ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గదులు సరిపోక.. బోధన సాగక

● తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలకు నోచుకోని వైనం ● ఇదీ కొండగండ్రేడు జిల్లా పరిషత్ పాఠశాలలో పరిస్థితి

గుర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగండ్రేడు జిల్లా పరిషత్ పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా తాగునీరు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సివస్తోంది. మూడు గదుల్లోనే తరగతులు నిర్వహించాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో గదులు సరిపోకపోవడంతో బోధన సక్రమంగా సాగడం లేదు.

కొండగండ్రేడు పాఠశాలలో మునగాలపేట, గేదెలపేట, ముద్దాడపేట, పల్లపేట, కొత్తవలస తదితర గ్రామాలకు చెందిన 142 మంది చదువుతున్నారు.ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. గదులు చాలకపోవడంతో ఆరో తరగతి గ్రామంలోని వేరేచోట నిర్వహిస్తున్నారు. మిగతా ఏడు నుంచి పదో తరగతి వరకూ మూడు గదుల్లోనే బోధించాల్సివస్తోంది. ఇందులోనే హెచ్‌ఎంతోపాటు కార్యాలయం నిర్వహిస్తున్నారు. తాగడానికి నీటి సదుపాయం లేకపోవడంతో ఇళ్ల నుంచి తీసుకురావాల్సివస్తోంది. విద్యార్థులకు బోధించడానికి బోర్డులు సైతం లేవు. ఎప్పటి చెత్త అప్పుడు ఊడ్చకపోవడంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాలలో సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో నాడు-నేడు పథకం కింద అదనపుగదుల పనులు ప్రారంభించినా బిల్లులు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతోప్రస్తుతం శిథిలావస్థకు చేరిన గదుల్లోనే బోధన సాగించాల్సివస్తోందని హెచ్‌ఎం గణపతిరావు తెలిపారు. మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ మలవిసర్జనకు సమీపంలోని కొండల వైపు వెళ్లాల్సివస్తోంది. అక్కడ విషజంతువులు సంచరిస్తుండడంతో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


మౌలిక సౌకర్యాలకు నోచుకొని కొండగండ్రేడు పాఠశాల

63 మద్యం సీసాల ధ్వంసం

రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా నిల్వచేసినా, తరలిస్తూ పట్టుబడినా, బెల్ట్‌షాపుల ద్వారా అమ్మకాలు చేసినా కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరంగం దొర తెలిపారు. ఈ మేరకు షాపులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఇటీవల మూడు కేసుల్లో పట్టుబడిన 63 మద్యం సీసాలను రాజాంలోని టౌన్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ధ్వంసంచేశారు. కార్యక్రమంలో రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

●సంతకవిటి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి పోలీసుస్టేషన్ పరిధిలో ఆరు పాత కేసుల్లో సీజ్ చేసిన 93 మద్యం సీసాలను ఎస్ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో మంగళవారం ధ్వంసం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

విజయనగరం క్రైం , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఇటీవల చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన నలుగురికి జైలుశిక్ష విధిస్తూ అడిషనల్ సివిల్ న్యాయాధికారి ఎంఎస్‌హెచ్ ఆర్.తేజ చక్రవర్తి తీర్పు వెల్లడించారని మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు.పట్టణంలో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టి, మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిపై కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. విజయనగరం ఫస్ట్ అడిషనల్ సివిల్‌న్యాయాధికారి కోర్టులో హాజరుపరచగా నిందితుల్లో చెన్నై శివకి 20 రోజులు, వై.శ్రీనుకి 15 రోజులు, వి.పరసయ్యకి ఆరు రోజులు, టి.రాంబాబుకి ఐదురోజులు జైలు శిక్ష విధించారని ఎస్పీ తెలిపారు.

దేవతలను దూషించడంపై ఫిర్యాదు

శృంగవరపుకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవతలను దూషించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్.కోట శ్రీభవానీ భక్త బృందం సభ్యులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ మతపరమైన కార్యక్రమంలో దేవుళ్లపై అసభ్య పదజాలం ఉపయోగించడంతో పాటు పేరు పెట్టి కించపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భక్తుల మనోభాలను దెబ్బతీసేవిదంగా మాట్లాడిన వ్యక్తి, ఇలా మాట్లాడేలా ప్రేరేపించిన వ్యక్తిపై కేసు నమోదుచేయాలని కోరారు.

కేజీహెచ్‌కి విద్యార్థి తరలింపు

చీపురుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి జి.ఆకాష్‌ను విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ డిప్లమో రెండోసంవత్సరం చదువుతున్న ఆకాష్ రైల్వేస్టేషన్ వరకూ ట్రాక్టర్‌పై ప్రయాణించగా మధ్యలో జారి పడిపోయాడు. దీంతో ఆకాష్‌ను ప్రథమ చికిత్స అనంతరం, విజయనగరం జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడినుంచి, విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా, కేజీహెచ్‌లో ఆకాష్‌ను వసతి గృహ సంక్షేమాధికారి మంగళగిరి శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు.

షాపులో అగ్నిప్రమాదం

రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని డోలపేటలోని బంకరు ఉపేంద్రకు చెందిన రిఫ్రిజిరేషన్, ఏసీ రిపేర్ షాపులో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రెండు లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, రిమ్మల్స్ ఏసీ, ఫ్రిజ్ స్పేర్‌పార్టులు దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే రాజాం అగ్నిమాపక శాఖ అధికారి అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

భోగాపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):సచివాలయాల సిబ్బంది సమయానుకూలంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరావు సూచించారు. మంగళవారం భోగాపురం, అమటాంరాయవలస, గూడెపువలస సచివాలయాలను సందర్శించారు. ఈసందర్భంగా సచివాలయాల్లో అందజేస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు, తదితర విషయాలపై ఆరాతీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు మండల గ్రామ సచివాలయాల అధికారి కేవీఎస్‌ఏ సీతారామరాజు, తదితరులు ఉన్నారు.

కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలి

నెల్లిమర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కనీస పెన్షన్ రూ.తొమ్మిదివేలు ఇవ్వాలని ఈపీఎఫ్ సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు మంగళవారం నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేటలోగల గాంధీ విగ్రహానికి నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు, కనకల పద్మనాభం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎఫ్ నిల్వలుఈ ఏడాదికి రూ.9.93 లక్షలు సంస్థ వద్ద మూలుగుతున్నాయని తెలిపారు. శీతాకాల సమావేశాల్లోనైనా కనీస పెన్షన్ పెంపు కోసం ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జరజాపుపేట గ్రామపెద్దలు

నెల్లిమర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఆ గ్రామపెద్దలు కోరారు. ఈ మేరకు నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతోపాటు కౌన్సిలర్లు, గ్రామపెద్దలు, నవోదయగ్రంథాలయ కమిటీ అధ్యక్షులు పోలుబోతు రామారావు, సభ్యులు, వివిధ ఉద్యోగులు, యువకులు నెల్లిమర్ల తహసీల్దార్ కె.శ్రీకాంత్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 105, 48లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో స్థలం కేటాయించాలని కోరారు.

సంఘాల బలోపేతమే లక్ష్యం కావాలి: పీడీ

రేగిడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు స్వయం ఉపాధితో ముందుకు వెళ్లాలని, వీటి బలోపేతమే సిబ్బంది లక్ష్యం కావాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపుసభ్యులకు మంగళవారం మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ (ఎంసీఎల్‌ఎఫ్)శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులు ప్రణాళికా బద్ధంగా లక్ష్యంతో ముందుకువెళ్లాలని కోరారు.కార్య క్రమంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, ఏపీఎం గోవిందరావు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

కోరిన పరిహారమిస్తేనే భూములిస్తాం

● తేల్చిచెప్పిన వీరనారాయణం, దాంపురం గ్రామస్థులు

ఎస్.కోట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలవరం కాలువ కోసం ప్రభుత్వం తాము కోరిన పరిహారం ఇస్తేనే భూములిస్తామని వీరనారాయణం, దాంపురం గ్రామస్థులు తేల్చిచెప్పారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన గ్రామసభలు స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా వీరనారాయణం గ్రామస్థులు ఎకరాకు రూ.50లక్షలు, దాంపురం గ్రామస్థులు ఎకరాకు రూ.80లక్షలు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వీరనారాయణంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

జిల్లాకు గోవా గవర్నర్ రాక

విజయనగరం, కలెక్టరేట్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గురువారం నుంచి ఈనెల 17 వరకూ జిల్లాలో వివిధ కార్యక్రమాలకు హాజరుకానున్నారు. 11వ తేదీ సాయంత్రం 6.45 గంటలకు కంటోన్మెంట్‌లోని భవనానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. 12న ఉదయం 11 గంటలకు కోటలో సింహాచలం దేవస్థానం అధికారితో సమా వేశం అవుతారు.

60 వేల సంతకాల సేకరణ

గరివిడి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో 60వేల సంతకాలు సేకరించామని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. వైద్య కళాశాలలను ప్రభుత్వం నడపాలని కోరారు. మంగళవారం గరివిడిలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సేకరించిన సంతకాలతో ఈనెల 15న విజయనగరంలో ర్యాలీ చేపడతామన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంసీఎల్ఎఫ్-1పై శిక్షణ

డెంకాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్ మాడ్యూల్ ఎంసీఎల్ఎఫ్-1పై శిక్షణ కార్యక్రమం మంగళవారం ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎల్ఎఫ్ స్థాయి సంస్థల విజన్ నిర్మాణం, గ్రామాభివృద్ధి చర్యల్లో సమర్థవంతమైన ప్రణాళికకు శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమానికి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తుమ్మరోతు లలిత తదితరులు హాజరయ్యారు.

పీ-4 ద్వారా ఆర్థిక సాయం

లక్కవరపుకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసం తగ్గించేందుకు రెండు కుటుంబాలకు పీ-4 ద్వారా రూ.50వేలు ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు మంగళవారం ఆర్థికసాయం చేశారు. కల్లేపల్లికి చెందిన మండల దేముడుబాబు, లచ్చింపేటకు చప్ప సన్నిబాబు కుటుంబాలకు సాయం అందించారు. కార్యక్రమంలో కేబీఏ.రాంప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, గండి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

42 మందికి నేత్ర వైద్య పరీక్షలు

రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజాంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రోటరీక్లబ్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరంలో 42 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో తొమ్మిది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి పాపారావు, సప్పటి వసంతకుమార్, మక్క అప్పలనాయుడు పాల్గొన్నారు.

భోగాపురంలో రిలే దీక్షలు

భోగాపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): న్యాయం జరిగేవరకు రిలేనిరాహార దీక్ష నిర్వహిస్తామని ముంజేరు పంచాయతీలోని సిద్ధార్థకాలనీ వాసులు తెలిపారు. దళితులపై జరిగిన దాడికి న్యాయం చేయాలని మంగళవారం భోగాపురంలోని మండల పరిషత్ కార్యాలయ కూడలిలో చేపట్టిన రిలే దీక్ష నాలుగోరోజుకి చేరింది.

ఆక్రమణదారులకు నోటీసులు

భోగాపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామపరిధిలో మూడు చెరువు గట్లపైఉన్న ఆక్రమణదారులకు రెండు రోజుల్లో నోటీసులు అందజేస్తామని ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడి చెరువు గట్లపై దుకాణాలకు పంచాయతీ సిబ్బంది ఎన్‌వోసీ ఇవ్వడంతోనే విద్యుత్ మీటర్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.అయితే పంచాయతీ నుంచి ఇటీవల ఇచ్చిన ఎన్‌వోసీలు రద్దుచేస్తున్నామని నోటీస్‌ఇచ్చారని తెలిపారు. వారిచ్చిన వివరాల ప్రకారం రెండు రోజుల్లో చెరువుగట్లపై ఉన్న వారికి వివరించి,మీటర్లు తొలగిస్తామని పేర్కొన్నారు. సుమారు 50నుంచి 60 వరకు మీటర్లు తొలగించనున్నామని, తమ విధులకు ఎవరూ అడ్డు తగలవద్దని, దీనికి అందరూ సహకరించాలని కోరారు.

హైస్కూల్‌కు మైక్‌సెట్ వితరణ

కొత్తవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస జడ్పీహైస్కూల్‌కు పూర్వ విద్యార్థి డాక్టర్ బెల్లాన రవిశంకర్ మైక్‌సెట్ వితరణగా అందజేశారు. 1977-82లో రవిశంకర్ కొత్తవలసలో పదోతరగతి వరకూ చదువుకున్నారు. అనంతరం విశాఖలో వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. మంగళవారం హైస్కూల్‌కు సంబంధించి మైక్‌సెట్ ఆంప్లిఫైర్‌ను అందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఈశ్వరరావు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు పెద్దపీట వేయాలి: మంత్రి

విజయనగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని, ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. గ్రామాలను అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లాలని తెలిపారు.విజయనగరంలో ఉపాధి హామీపథకం అమలు జరుగుతున్న తీరును మంత్రి ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై చర్చించారు. ఇప్పటికే ఈ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు, పెండింగ్ బిల్లుల స్థితిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్, విజయనగరం , బొబ్బిలి ఈఈ లు రత్నకుమార్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి


చాకివలస గ్రామస్థులతో మాట్లాడుతున్న నాగమాధవి

భోగాపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మంగళవారం మండలంలోని చాకివలసలో మనప్రజలతో-మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామంలో ప్రజలు తాగునీటి ట్యాంకు పనిచేయకపోవడం, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు, ఉపాధిపథకం జాబ్‌కార్డులు, తదితర సమస్యలను ఆమెదృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్, పల్లరాంబాబు, బొల్లుత్రినాద్, వందనాల రమణ, పడాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో గాయిత్రీ, కార్యదర్శి అసిరయ్య పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.పది కోట్ల మంజూరు

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల్లోని ఏడు గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరైనట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.వేపాడ నుంచి కడకొండ రోడ్డుకు రూ.2.75 కోట్లు, వేపాడ మండలంలోని విశాఖ-అరకు రోడ్డు నుంచి ఎల్.కోట మండలంలోని కల్లేపూడి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.74కోట్లు, కేజీపూడి నుంచి కోటయ్య గరువురోడ్డుకు రూ.1.32కోట్లు, ఎస్.కోట మండలంలోని విశాఖ-అరకు రోడ్డు నుంచి టీకేఆర్‌పురం రోడ్డుకు రూ.1.10 కోట్లు, కొత్తవలస మండలంలోని విశాఖ-అరకు రోడ్డు నుంచి యర్రవానిపాలెం, బలిఘట్టం రోడ్డుకు రూ. 1.18 కోట్లు, రాజన్నవానిపాలెం రోడ్డుకు రూ.0.92కోట్లు, సెంట్ఆన్స్ కాన్వెంట్ మంగళపాలెంరోడ్డుకు రూ.0.27కోట్లు మెత్తం రూ.9.28 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. 16.71 కిలోమీటర్ల మేర పలు రోడ్ల నిర్మాణం జరగనున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుకు అనుమతి రద్దు

చీపురుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీఆర్ ధన వెంకటేశ్వర రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు అనుమతిని రద్దు చేశారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాన్ని డీట్యాగ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. ధాన్యం కొనుగోలులో మిల్లు యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఇటీవల కొంతమంది జనసేన కార్యకర్తలు అధికారులకు ఫిర్యాదుచేశారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యంలో మిల్లు యాజమాన్యం క్వింటాకు ఐదుకిలోలు తరుగు కింద తీసుకుంటోందని జనసేన కార్యకర్తలు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈనేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ డి.ధర్మరాజు విచారణ నిర్వహించారు. రైతులతో మాట్లాడి, అక్రమాలు నిజమేనని ధ్రువీకరించి, జిల్లా అధికారులకు నివేదిక పంపించారు. దీంతో మిల్లులో ధాన్యం కొనుగోలును రద్దు చేస్తూ జిల్లా అధికారులు తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేయడంతో, ఆయన అనుమతిని రద్దు చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి


పోలీసులకు సూచనలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

దత్తిరాజేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పెదమానాపురం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కేసుల వివరాలు, వాటి పురోగతి, స్టేషన్‌లో నిర్వహించే రికార్డులను ఎస్ఐ ఆర్.జయంతిని అడిగితెలుసుకునారు. బ్లాక్‌స్పాట్‌లను గజపతినగరం సీఐ జీఏవీ రమణ, ఎస్‌ఐలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏపీఎస్ ఆర్టీసీడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారికి రోడ్డు ప్రమాదాలు జరగకుండా బస్సులు నడపాలని సూచించారు.

ఎల్.కోటలో విగ్రహాల ఆవిష్కరణ


అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

లక్కవరపుకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఎల్.కోట తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అల్లూరి సీతారామరాజు, మహాత్మగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, పొట్టి శ్రీరాములు, గిడుగురామ్మూర్తి, జ్యోతిరావు పూలే, మదర్ థెరిసా, గురజాడ అప్పారావు, స్వామి వివేకానంద, ఏపీజే అబ్దుల్ కలాం, జ్యోతిబాపూలే తదితర 13 విగ్రహాలను విగ్రహాలను ఎమ్మెల్యే లలితకుమారి,కలెక్టర్ రామ సుందర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, ఆర్డీవో కీర్తి, డీఆర్వో మురళి, డీటీలు అప్పారావు, రమేష్, కరెడ్ల ఈశ్వరరావు, మల్లునాయుడు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి: ఏపీడీ

కొత్తవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు సంచాలకురాలు కె. సావిత్రి కోరారు. మంగళవారం కొత్తవలస మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశం ఏపీఎం వెంకట రమణ ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ పేరుతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 10 , రెండో విడత కింద నాలుగు, మూడో విడత కింద మూడు మండల సమాఖ్యలను మోడల్ సమాఖ్యలుగా తయారు చేయనున్నట్లు తెలిపారు. ఇలా తయారు చేసిన వాటిని జాతీయ గ్రామీణజీవనోపాదుల మిషన్‌కు ప్రతిపాదనలను పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థాగత నిర్మాణ ఏపీఎం విశ్వేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మిప్రసన్న, అబద్దం, అప్పలస్వామి, అప్పలనాయుడు, భారతి పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో అధ్యక్షుడిగా సుధాకరరావు


ఎన్నికైన శృంగవరపుకోట తాలూకా ఏపీఎన్జీవో కార్యవర్గం

శృంగవరపుకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట తాలూకా ఏపీఎన్జీవో అధ్యక్షుడిగా ఎస్‌వీ సుధాకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం శృంగవరపుకోట ఏపీఎన్జీవో తాలూకా కార్యాలయంలో కొత్తవలస తాలూకా ఏపీఎన్జీవో అధ్యక్షుడు జేవీ ప్రసాదరావు ఎన్నికలఅధికారిగా ఎన్నిక నిర్వహించారు.అసోసియేట్ అధ్యక్షులుగా జె.సంధ్యాకళ్యాణి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ కృష్ణ, వై.రామచంద్రరావు, ఎల్.బంగారు నాయుడు, ఎస్.చంద్రరావు, కె.దేవి, కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.అనుష, జాయింట్ సెక్రటరీలుగా ఎ.చిన్నారావు, కె.హరి, ఎస్‌కె ఫెరోజ్, హరినాథ్, మహిళ జాయింట్ సెక్రటరీగా ఎంజే ఉదయలక్ష్మిను ఎన్నుకున్నారు.

భూసేకరణపై సీబీఐతో విచారణ చేయించాలి

ఎస్.కోట రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీకి భూసేకరణ చేసిన సమయంలో జారీచేసిన జీవో -892 పరిధిలో లేని భూములు 213 ఎకరాలు అప్పటి రెవెన్యూ అధికారులు ఎలా రిజిస్ట్రేషన్ చేయించారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రశ్నించారు. వందలాది మంది హరిజన, గిరిజనులకు మోసంచేశారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే భూసేకరణపై రైతులు ఆరోపిస్తున్న అంశాలపై సీబీఐ విచారణ చేయించాలని కోరారు. మంగళవారం బొడ్డవరలో విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ భూసేకరణలోఅవకతవకలు జరిగాయని నిర్వాసితులు179 రోజులుగా ఆరోపిస్తున్నా అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమ న్నారు. జిందాల్ భూసేకరణలో అప్పటి రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

శ్మశానవాటికలో షెడ్ కూలదోతపై విచారణ

పూసపాటిరేగ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అగ్రహారంలో గల బీసీ శ్మశానవాటికలో కొద్దినెలల కిందట దహనకార్యక్రమానికినిర్మించిన షెడ్‌ను కూలదోయడంపై డీఎల్‌పీవో శిరీషరాణి మంగళవారం విచారణ నిర్వహించారు. ఎటువంటి అనుమతి లేకుండా కూలదోశారని గ్రామానికి చెందిన చందక హరిబాబు ఫిర్యాదు అందజేశారు. ఈవిషయమై ఇప్పటికే పలుమార్లు విచారణ చేపట్టడంతోపాటు ఎంపీడీవో రాధిక ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించి విచారణ చేపట్టారు. తిరిగి మళ్లీ ఫిర్యాదుమేరకు శిరీషరాణి విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల రఘు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

● రాజాంలో మునిసిపల్ కార్మికుల ధర్నా

రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దుచేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మంగళవారం రాజాం మెయిన్‌రోడ్‌లో సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడచినా కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంత్రుల కమిటీ వేసి నెలరోజులు గడచినా నివేదిక ఇవ్వలేదని ఆరోపించారు.


ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

ప్రణాళికాబద్ధంగా చదవాలి: డీఈవో

బొండపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):పదోతరగతి విద్యార్థులు వంద రోజుల ప్రణాళికను తయారు చేసుకొని ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని డీఈవో యు.మాణిక్యంనాయుడు కోరారు. మంగళవారం మండలంలోని ఒంపల్లి జడ్పీ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలకు సమయం వంద రోజులు మాత్రమే ఉందని, ప్రతీ రోజు కూడా చాలా కీలకమైనదని తెలిపారు.

పంచాయతీ ఏర్పాటుకు గ్రామసభ

దత్తిరాజేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని మరడాం పంచాయతీ పరిధిలో గల మర్రివలస పంచాయతీ ఏర్పాటు కోసం మంగళవారం గ్రామసభ నిర్వహించినట్లు కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పంచాయతీల ఏర్పాటుకు గ్రామసభ తీర్మానం, ప్రజల అభిప్రాయాల సేకరణకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మరడాం సర్పంచ్ పోతల రామలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచాలి: ఆర్జేడీ


మాట్లాడుతున్న విజయభాస్కర్

నెల్లిమర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి పెంపుదలకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విద్యాశాఖ ఆర్జేడీ కె.విజయభాస్కర్ కోరారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాల రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణకార్యక్రమాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో ఉపాధ్యాయుల సూర్యనారాయణ మూర్తి, హెచ్‌ఎం సుసర్ల కామేశ్వరి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

విజయనగరం కలెక్టరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):సీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీ సీపీఎస్‌ఈఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీప్రతాన్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయనగరంలోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ డీఏ, టీఏ,జీతాల బకాయిలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

ప్రాధాన్య క్రమంలో రోడ్ల నిర్మాణం

రాజాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యతాక్రమంలో 17వ వార్డులో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎ.రామచంద్రరావు హామీ ఇచ్చారు. మంగళవారం మునిసిపాలిటీలోని 17వ వార్డు అమ్మవారికాలనీ, టీచర్స్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, గోపాలపురం రోడ్డులో కాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంకి గౌరీశ్వరరావు తంగుడుబియ్యం శ్రీనివాసరావు, దేవిరెడ్డి రామారావు, లెంక శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

సమస్యల కూత వినిపించదా..?

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా సాలూరు నుంచి విశాఖపట్నం వరకు రైలు నడుపుతామని గతంలో రైల్వేశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌లో చకా చకా పనులు చేశారు. దీంతో సాలూరు వాసులు ఎంతో సంబరపడ్డారు. అయితే వారి ఆనందరం ఎంతో కాలం నిలవ లేదు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రకటించి నెలలు గడుస్తున్నా.. ఇంకా ఆ రైలు మాత్రం రాలేదు. ప్రస్తుతం సాలూరు రైల్వేస్టేషన్ పిచ్చిమొక్కలతో అధ్వానంగా దర్శన మిస్తోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

వినతులు ఇచ్చినా ...

జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారానికి పలుమార్లు ఆశాఖ ఉన్నతాధికారులకు వినతులు ఇస్తున్నా.. ఫలితం శూన్యం. స్టేషన్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవంగా పార్వతీపురం టౌన్, బెలంగా రైల్వే స్టేషన్ల నుంచి భారీగానే ఆదాయం వస్తున్నా.. సౌకర్యాల కల్పనపై ఆ శాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా ప్రయాణి కులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధి కారులు రైల్వే శాఖపై ఒత్తిడి తెచ్చి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మన్యం వాసులు కోరుతున్నారు.

16 లోగా విచారణకు హాజరుకావాలి

(5వ పేజీ తరువాయి)

సభ్యులు ఉండగా, 600 మందికి నోటీసులు జారీ చేశాం. రుణాలు పొందిన వారిలో 60 మందికి పైగా హాజరయ్యారు. సుమారు 31 మంది సభ్యుల పేరుతో నిధులను దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. నోటీసులు తీసుకున్న వారు, తీసుకోలేని వారు రశీదులతో ఈ నెల 12 నుంచి 16వ తేదీ లోపు గరుగుబిల్లి పీఏసీఎస్ కార్యాలయానికి హాజరుకావాలి.' అని తెలిపారు.

ఆ ఆహారం అపాయం

(5వ పేజీ తరువాయి)

ఇబ్బంది పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అపరిశుభ్రత, కలుషిత తాగునీరు తదితర కారణాలతో ఈ బ్యాక్టీరియా వృద్ధి చెందుతోందంటున్నారు. ఇంట్లో ఒకరికి సోకితే, మిగతా వారు దీని బారిన పడే ముప్పు వుందంటున్నారు. హెచ్ పైలోరీ సోకినప్పటికీ 80 శాతం మందిలో ఎలాంటి లక్షణాలు కన్పించవు. కొద్ది మందిలో మాత్రం అజీర్తి, పొట్టలో నొప్పి, గ్యాస్ తదితర ఇబ్బందులు ఉంటాయి. చికిత్స తీసుకోకపోతే దీర్ఘకాలంలో ఒక శాతం మందికి పొట్ట క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

పరిశుభ్రత కీలకం

హెచ్ పైలోరీ, గ్యాస్ట్రిక్ సమస్యల బారి నుంచి రక్షించుకోవడానికి ముందుజాగ్రత్త ఒక్కటే మార్గం. నిర్దీత సమయంలో భోజనం చేయాలి. మాసాలాలు, కారం తగ్గించాలి. ఆహారం తీసుకునే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్, అపరిశుభ్రమైన ప్రదేశాల్లో ఆహారం, నీరు తీసుకోవడం వల్ల ఇన్‌ఫెక్షన్‌లకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ బ్యాక్టీరియా, గ్యాస్ సమస్యలను అధునాతన వైద్యంతో నయం చేయవచ్చు. కాని నిర్లక్ష్యం చేస్తే అది అంతిమంగా కడుపు క్యాన్సర్‌కు దారి తీయవచ్చు.

-శ్రావణ్‌కుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, జీఐ అంకాలజిస్ట్, విజయనగరం

పరీక్షలు తప్పనిసరి

హెచ్ పైలోరీ ఇన్‌ఫెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ రాకపోవచ్చు. కాని దీర్ఘకాలిక గ్యాస్ట్రైటీస్, అల్సర్లు ఉన్న వారు తప్పనిసరిగా హెచ్ పైలోరీ పరీక్షలు చేయించుకోవాలి. కడుపు క్యాన్సర్‌కు కారణమమయ్యే ప్రమాదకారకాల్లో ఇది ముఖ్యమైనది. అపరిశుభ్రత, కలుషిత తాగునీరు తదితర కారణాలతో ఈ బ్యాక్టీరియా వృద్ధి చెందుతున్నది. గ్యాస్ట్రిక్ లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

- ఐ.నరేష్‌కుమార్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, విజయనగరం


కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ సేవాశిబిరం



ప్రశంసాపత్రాలతో వలంటీర్లు

పాలకొండ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీ, వడమ గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్యాంబాబు మాట్లాడుతూ విద్యాభ్యాసంలో ఒక భాగంగా సంఘ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు మాట్లాడుతూ విద్యార్థులకు సేవా దృక్పథం ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి స్కూల్ డైరెక్టర్ దూబ వెంకటరమణ, ప్రజాప్రతినిధులు వెలమల మన్మథరావు, కాంతారావు, లక్ష్మణరావు, మోహనరావు, రాంబాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు జయమణి, రాజు, యోగా గురువు జనార్దనరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీపట్నంలో స్వచ్ఛత



వ్యర్థాలను తొలగిస్తున్న వలంటీర్లు

మక్కువ రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కాశీపట్నంలో మంగళవారం ప్రత్యేక సేవాశిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా వలంటీర్లు వీధుల్లోనిచెత్తాచెదారాలను తొలగించారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజులవీణ, మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శంబంగి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక ఎల్విన్‌పేట కూడలిలో నిర్వహించారు. కురుపాం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ, అందరికీ ఆరోగ్య భద్రత, ఆరోగ్యశ్రీ, 108, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను సోనియా ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోలక జయరాం, మీసాల ఫ్రాన్సిస్, సంపత్‌కుమార్, శ్రీధర్, మహేంద్ర, రమేశ్, మహేశ్, పాలక జయంతిరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పునర్విభజనపై గ్రామసభ

బొబ్బిలి రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పునర్విభజన వల్ల సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందుబాటులో తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందని సర్పంచ్ పిల్లా వసుంధర అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమ్మవలసలో మంగళవారం కమ్మవలస, ముత్తావలస గ్రామాల పునర్విభజనపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ముత్తావలస గ్రామాన్ని ఒక పంచాయతీగా విభజించాలని తీర్మానం చేశారు.

గ్రామాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తాం

● ఎమ్మెల్యే విజయచంద్ర



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలను కూటమి ప్రభుత్వం కల్పింస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం బూర్జ, కృష్ణరాయపురం, అంకలం గ్రామాల రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఈ గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా రహదారి నిర్మాణానికి హామీ ఇచ్చానన్నారు. ఇప్పుడు రహదారిని నిర్మిస్తున్నామన్నారు. అలాగే తాగునీటి సమస్యను కూడా ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే తాగునీటి సమస్య కూడా పరిష్కరిస్తానన్నారు. అలాగే ప్రతీ గ్రామానికి సీసీ రోడ్లు, కాలువలు, లింకు రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదాం



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

వీరఘట్టం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదామని డీఎస్పీ రాంబాబు యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం నడిమికెల్లకు అభ్యుదయం సైకిల్ యాత్రకు చేరింది. యాత్రకు డీఎస్పీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు కృషి చేద్దామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో చినమేరంగి సీఐ తిరుపతిరావు, ఎస్ఐ జి.కళాధర్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంపిలి ప్రాంతంలో హెడ్ వాటర్ వర్క్స్ పంపింగ్ మోటార్ మరమ్మతులకు గురైందని నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు తెలిపారు. దీని వల్ల పట్టణంలో బుధవారం 3, 4, 5, 6 వార్డులకు తాగునీటి సరఫరాలో అంతరా యం ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నా మని కమిషనర్ తెలిపారు.

గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి



గర్భిణులకు సూచనలిస్తున్న డా.తిరుమలప్రసాద్

గరుగుబిల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై ఆశా వర్కర్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ఎంకే తిరుమలప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజనలో భాగంగా గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సుకు వైద్య సిబ్బంది అంకితభావంతో వైద్య సేవలందించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా ఉండేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎన్.జగదీశ్వరి, హెల్త్ విజిటర్ సీహెచ్ ఉదయకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటి సంతకాల పత్రాల ప్రదర్శన

పాలకొండ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం ఆయన స్వగృహంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ పత్రాలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న ఉమాజ్యోతి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని కృషి విజ్ఞాన కేంద్రం ఎస్ఎం ఉమాజ్యోతి అన్నారు. జె.కె.పాడులో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ క్రమం తప్పకుండా గుడ్లు, పాలు, పెరుగు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచి ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో రామయ్య, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో వలంటీర్లు మొక్కలు నాటారు.

మహాసభలను జయప్రదం చేయండి

పాలకొండ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ వద్ద మహాసభల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు మహాసభలు జరుగుతాయన్నారు. జనవరి 4న బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

మండల బడ్జెట్ ఆమోదం

వీరఘట్టం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిత్ కార్యాలయంలో మంగళవారం దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సర సవరణ బడ్జెట్ 2026-27 సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఎంపీడీవో బి.వెంకటరమణ చదివి సభ్యులకు వినిపించారు. బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులకు పత్తి విక్రయాలు

● ఈ క్రాప్ నమోదు కాకపోవడమే కారణం



గుళ్లతో పత్తి కాటా వేస్తున్న దృశ్యం

భామిని, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో పత్తి పంటకు ఈ క్రాప్ నమోదు చేయకపోవడంతో వ్యాపారులకు పత్తి విక్రయాలు చేపట్టాల్సిన పరిస్థితి రైతులకు నెలకొంది. వాస్తవానికి సీసీఐ క్వింటా పత్తి ధర రూ.8110 ప్రకటించింది. అయితే లివిరిలో ఒడిశాకు చెందిన పత్తి వ్యాపారి క్వింటా రూ.5600 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. పత్తి నాసిరకంగా ఉందనే సాకుతో పెత్తఎత్తున కొనుగోలు చేపడుతున్నారు. పత్తి కొనుగోలుకు కంప్యూటర్ కాటా వినియోగించాల్సి ఉన్నా గుళ్లతోనే తూకం వేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పత్తి రైతులు నష్టపోతున్నారు.

12న హుండీల లెక్కింపు

పాలకొండ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ అమ్మవారి గ్రూప్ దేవాలయాల హుండీలను ఈ నెల 12న ఉదయం లెక్కించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీస్, రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో భక్తులు, సేవకులు, అర్చకులు సిబ్బందితో హుండీలను లెక్కిస్తామన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న డా.జగన్మోహనరావు

కొమరాడ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతినెలా పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం ఆర్‌బీ పురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సురక్షిత ప్రసవమే లక్ష్యంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కార్డుల్లో ఆరోగ్య తనిఖీలు, పరీక్షల వివరాలు పరిశీలించారు.

రోజూ 2 వేల మందితో పనులు చేపట్టాలి

సీతానగరం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి రోజు 2 వేల మంది వేతనదారులతో ఉపాధి పనులు జరిపించాలని ఏపీవో బాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ బుధవారం నుంచి 22 పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పించాలన్నారు.

మిల్లర్ల తీరుపై రైతుల నిరసన



దత్తివలసలో రైస్ మిల్లు ఆవరణలో విచారణ నిర్వహిస్తున్న తహసీల్దార్ బాల


గరుగుబిల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రైస్ మిల్లర్ల తీరుపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం దత్తివలస గ్రామానికి చెందిన సుమారు 80 మంది రైతులు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. హెచ్చు ధాన్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అలాగే 40 కిలోల ధాన్యం బస్తాను మిల్లు ప్రాంతంలో దింపేందుకు కొంత మొత్తం డిమాండ్ చేస్తున్నారన్నారు. దాంతో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతను విచారణ చేయించాలని సూచించారు. దాంతో తహసీల్దార్ పి.బాల, ఉప తహసీల్దార్ ఎస్.మారుతీరావులను దర్యాప్తునకు ఆదేశించారు. దాంతో వారు రైస్ మిల్లు ప్రతినిధులు, రైతులతో చర్చించారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు ధిక్కరిస్తే చర్యలు తప్పవన్నారు.

మహిళలను లక్షాధికారులను చేస్తాం

గరుగుబిల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా వెలుగు సిబ్బంది, వీవోఏలు గ్రామైక్య సంఘాలకు సంస్థాగత నిర్మాణంపై శిక్షణ నిర్వహిస్తున్నామని క్లస్టర్ కోఆర్డినేటర్ చందాన తిరుపతిరావు అన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి ఆదేశాల మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, గ్రామం పరంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సంస్థాగత నిర్మాణంపై మొదట వెలుగు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, బి.రామినాయుడు, వి.లక్ష్మణరావు, టి.చంద్రమోహన్, కె.మరియదాసు, యు.శాంతికుమారి, వీవోఏలు వి.స్వాతి, బి.జ్యోతి, పి.విజయ, సి.వరలక్ష్మి, బి.రాజేశ్వరి, జి.అనురాధ, వి.శ్రీదేవి, జి.జయలక్ష్మి, జి.కల్పనపాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయాల నిర్మాణాలు

● అద్దె భవనాల్లో ఉద్యోగుల విధులు
● వివిధ పనులపై వచ్చేవారికి తప్పని ఇక్కట్లు





మార్కొండపుట్టిలో నిలిచిన సచివాలయ నిర్మాణం, పునాది స్థాయిలో నిలిచిన శంబరలో భవనం

మక్కువ రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో ప్రారంభించిన సచివాలయాల భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఉద్యోగులు అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ ఉద్యోగులు సరిపడేంత చోటు లేకపోవడంతో ఇటు ఉద్యోగులు.. అటు వివిధ పనులపై వచ్చే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. వైసీపీ ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 17 సచివాలయాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరుచేసింది. అందులో 10 భవనాలు పూర్తి కాగా 7 భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. నిర్మాణాలకు అవసరమైన నిధులు విడు దల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. దీంతో మండలంలోని ఏడు సచివాల యాలకు అద్దె భవనాలే దిక్కయ్యాయి. మార్కొండ పుట్టి సచివాలయం నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరు కాగా 22లోనే పనులు ప్రారంభమయ్యాయి. బిలులు సకాలంలో చెల్లించక పోవడంతో స్లాబ్ స్థాయిలోనే పనులు నిలిచాయి. శంబరలో సచివాలయానికి రూ.35 లక్షలు మం జూరు చేసినప్పటికీ పనులు పునాదుల దశలోనే ఉన్నాయి. దబ్బగెడ్డ సచివాలయానికి రూ.40 లక్షలు మంజూరు కాగా, 70శాతం పనులు పూర్తయ్యాయి. తలుపులు, గచ్చులు, కిటికీలు, ప్లాస్టరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కవిరిపల్లిలో సచివాలయం, రైతు సేవా కేంద్రం నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరయ్యాయి. 80 శాతం పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వెంకటభైరిపురం, ఎ.వెంకంపేట సచివాలయాల నిర్మాణాలు కూడా నిధుల కొరతతో నిలిచిపోయాయి. ● ఈ విషయాన్ని మండలం ఇంజనీర్ రజిత్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అన్ని భవన నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయన్నారు. నిధులు సకాలంలో విడు దల కాకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలో వదిలి వెళ్లిపోయారన్నారు. సచివాలయాల పరిస్థితిని ఉన్నతాధికారులు తెలియజేశామన్నారు.

కలెక్టర్‌కు ఆత్మీయ సత్కారం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎంఈవోలు

బెలగాం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యార్థుల పరిశుభ్రత కోసం ముస్తాబు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి పక్కాగా అమలు చేస్తుండటంతో భామిని పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. కలెక్టర్‌ను అభినందించారు. సీఎం అభినందనలు అందుకున్న కలెక్టర్‌ను మంగళవారం ఎంఈవో-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ఉపాధ్యక్షుడు జె.నారాయణస్వామి ఆధ్వర్యంలో ఎంఈవోలు సత్కరించారు. సామల సింహాచలం మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముస్తాబు కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. దీనివల్ల విద్యార్థుల ఆరోగ్య అలవాట్లపై అవగాహన కలగడానికి దోహదపడుతుందన్నారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి

పార్వతీపురం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో డీపీవో కొండలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్యం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో శుభ్రత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల సరఫరాకు టెండర్లు

సీతంపేట రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలకు నిత్యావసర సరుకుల సరఫరాకు సంబంధించి మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెండర్ల ప్రక్రియలో మొత్తంగా 25 రకాలకు చెందిన నిత్యావసర సరుకులతో పాటు గిరిజన విద్యార్థులకు కావాల్సిన 10 రకాలు కాస్మొటిక్స్ పంపిణీకి టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లలో 10 మంది బిడ్‌లు దాఖలు చేశారు. అందులో టెండర్ల ప్రక్రియకు 9 మంది హాజరైనట్లు జీసీసీ డిఎం సంధ్యారాణి తెలిపారు. టెండర్లు దక్కించుకున్న వారు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని సూచించారు. టెండర్‌ల నిర్వహణలో ఇన్‌చార్జి ఏపీవో ఆర్.వి.గణేష్, డీడీ అన్నాదొర, జీసీసీ బీఎంలు డి.కృష్ణారావు, నర్సింహులు, హెచ్‌డబ్ల్యూవోలు పి.అమల, శారద పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కురుపాం రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం మండలం బుడ్డెంఖర్జ సమీపంలో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటన లో తీవ్రంగా గాయపడిన ఉపాధి క్షేత్ర సహాయకుడు గోర్ల గౌరీశంకర్ మంగళవారం విజయనగరం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కిచ్చాడ పంచాయతీలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గౌరీశంకర్ స్వగ్రామం పట్టాయిదొరవలస.

సైకిల్ యాత్రకు స్వాగతం

పార్వతీపురం రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహిస్తున్న అభ్యుదయం సైకిల్ యాత్రకు మంగళవారం అడ్డాపుశీల ప్రాంతంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సీఐ రంగనాథం మాట్లాడుతూ మాదకద్రవ్యాలను నివారించడ మే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మటన్ విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

వీరఘట్టం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మటన్ విక్రయాలు చేపట్టేవారు విధిగా లైసెన్స్ తీసుకోవాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎం.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. మండలశారం వీరఘట్టం మటన్ విక్రయిస్తున్న దుకాణాలను ఆయన పరిశీలించారు. మార్కెట్‌కు దగ్గరలో అందరూ ఒకేచోట పరిశుభ్రత వాతావరణంలో మటన్ దుకాణాలను నిర్వహించాలన్నారు. అలా కాని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎంపీడీవో వెంకటరమణ ఉన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించండి

జియ్యమ్మవలస, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు మండల పరిషత్ కార్యాలయం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రంగా ఉంచుతున్న తమకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. మూడు నెలలకు, ఆరు నెలలకు ఒకసారి జీతాలు వేస్తున్నారన్నారు. జీతాలను బ్యాంకు అకౌంట్‌లోనే జమ చేయాలన్నారు. మెడికల్ అలవెన్సు రూ. 4 వేలు చెల్లించాలన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అందించారు. నిరసనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లి గంగునాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు ఆరిక అర్జున, గుండయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.